Toli Velugu 17.01.26_Layout 1 1/17/2026 9:47 AM Page 1


జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..





నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 09 | పేజీలు : 5 | శనివారం | 17 జనవరి 2026 | వెల : 2/-

## అందుకే మోదీని కలుస్తున్నా

### - రేవంత్ రెడ్డి

- రాష్ట్ర అభివృద్ధి కోసమే మోదీని కలుస్తున్నానన్న రేవంత్ రెడ్డి
- బాసరలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడి
- ప్రజలు అండగా ఉంటే రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తానన్న సీఎం



(తోలి వెలుగు), డెస్క్, జనవరి 16 : ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమేనని, కానీ ఎన్నికల తర్వాత అభివృద్ధి కోసం అందరం కలిసి ముందుకు సాగాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వాన్ని కలుస్తామని, సాధ్యమైనంత వరకు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. మోదీ తనకు వ్యక్తిగత బంధువుకాదని, దేశ ప్రధాని కాబట్టే ప్రాంత అభివృద్ధి కోసం ఆయనను కలుస్తున్నానని తెలిపారు. ప్రాంత ప్రయోజనాల కోసం ఎవరినైనా కలుస్తానని, తనకు వ్యక్తిగత పైరవీలు లేదా స్వార్థ ప్రయోజనాలు లేవని స్పష్టం చేశారు. నిర్మల్ లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ఎంతో ప్రత్యేకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ జిల్లాకు అందాల్సిన న్యాయం, జరగాల్సిన అభివృద్ధి గతంలో సరిగా జరగలేదని వ్యాఖ్యానించారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు కూడా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు...

2

## ఇదే చివరి అవకాశం..

### ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో స్పీకర్ కు సుప్రీంకోర్టు షాక్!





- ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం
- స్పీకర్ పై సుప్రీం ఆగ్రహం
- గత ఏడాది నవంబర్ లోనే సుప్రీం కీలక ఆదేశం
- ఇప్పటికే చాలా సమయం ఇచ్చామన్న సుప్రీం

(తోలి వెలుగు), డెస్క్, జనవరి 16 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారం పైన కీలక పరిణామం చోటు చేసుకుంది. ధర్మాసనం ఈ వ్యవహారం పై కీలక వ్యాఖ్యలు చేసింది. ఎమ్మెల్యేల ఫిరాయింపుల పైన చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కు సమయం ఇచ్చిన సుప్రీం ధర్మాసనం తాజాగా ఆగ్రహం వ్యక్తం చేసింది.

**ఇప్పటికే చాలా సమయం ఇచ్చామన్న సుప్రీం**

ఈరోజు బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారం పైన విచారణ చేపట్టిన ధర్మాసనం ఇప్పటివరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సీరియస్ అయింది. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని ఇది చివరి అవకాశం అని అల్టిమేటం జారీ చేసింది. ఇకపైన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకోకపోతే తీవ్రంగా వ్యవహరించాల్సి వస్తుందని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.

**ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం**

ఈ కేసులో తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉంటే వింటర్ వెకేషన్ తర్వాత తొలిసారిగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కేసు పైన సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జి ధర్మాసనం ఈ కేసును విచారించింది ఇదిలా ఉంటే 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. వారిపైన దాఖలు చేసిన అనర్హత పిటీషన్లు కొట్టివేశారు.....

2

## కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతకొద్దు

- టీఎస్ ఐపాస్ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించిందన్న కేటీఆర్
- ఈ విధానం ద్వారా రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి
- పదేళ్లలో 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని స్పష్టీకరణ
- కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతకొద్దని ప్రత్యర్థులకు హితవు
- రైతుబంధు, మిషన్ భగీరథలాగే టీఎస్ ఐపాస్‌కు జాతీయ గుర్తింపు లభించిందని వ్యాఖ్య



(తోలి వెలుగు), డెస్క్, జనవరి 16 : తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రూపకల్పన చేసిన టీఎస్ ఐపాస్ విధానం దేశంలోనే అత్యుత్తమమైనదని సాక్షాత్తు నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో ప్రశంసించడం తెలంగాణకు గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి, కేసీఆర్ దార్శనికతకు ఈ గుర్తింపే నిలువెత్తు నిదర్శనమని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్ల కాలంలోనే దేశానికే పారిశ్రామిక దిక్సూచిగా మార్చడంలో టీఎస్ ఐపాస్ పోషించిన పాత్ర అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వ సంస్థే చెప్పడం గొప్ప విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించి, సింగిల్ విండో విధానంలో కేవలం 15 నుంచి..

2

## భారత్ కు మరిన్ని రఫేల్ యుద్ధ విమానాలు...

### – డీపీబీ గ్రీన్ సిగ్నల్

- 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు ఆయుధ సేకరణ బోర్డు ఆమోదం
- రక్షణ మంత్రి నేతృత్వంలోని డీఏసీ ముందుకు వెళ్లనున్న ఫైల్
- వచ్చే నెలలోనే భారత్, ఫ్రాన్స్ మధ్య తుది ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం
- హైదరాబాద్‌లోని టాటా ప్లాంట్‌లో రఫేల్ ఫ్యూజ్‌లేజ్‌ల తయారీకి ఒప్పందం

(తోలి వెలుగు), డెస్క్, జనవరి 16 : భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసే ప్రతిపాదనకు ఆయుధ సేకరణ బోర్డు (డీపీబీ) శుక్రవారం ఆమోదం తెలిపింది. భారత వాయుసేన (ఐఏఎఫ్) గత ఏడాది ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖకు అధికారికంగా ప్రతిపాదన పంపిన విషయం తెలిసిందే. రక్షణ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రతిపాదన తదుపరి ఆమోదం కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ కొనుగోలు మండలి (డీఏసీ) ముందుకు వెళ్లనుంది. అనంతరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ దీనికి తుది...



2

## నిజాం ఒక హంతకుడు : ధర్మపురి అర్వింద్

- నిజాం పేరును నిజామాబాద్ కు ఎందుకు పెట్టుకుంటారన్న అర్వింద్
- నిజామాబాద్ ను ఇందూర్ గా పిలవాలని డిమాండ్
- నిజాం ఎప్పటికీ దుర్మార్గుడిగానే మిగిలిపోతాడని వ్యాఖ్య

(తోలి వెలుగు), డెస్క్, జనవరి 16 : నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించారు. తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన... శ్రీరాముడికీ బీజేపీ మెంబర్‌షిప్ ఉందని, అనుమానం ఉంటే వెళ్లి చూసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌ను ఉద్దేశించి



అన్నారు. నిజామాబాద్‌ను 'ఇందూర్'గా పిలవాలని ఎంపీ అర్వింద్ డిమాండ్ చేశారు. నిజాం ఒక హంతకుడని, అలాంటి వ్యక్తి పేరును నిజామాబాద్ కు ఎందుకు పెట్టుకుంటారని అన్నారు. ఇందూర్ అనే పేరు ఎలా వచ్చిందన్న దానిపై చారిత్రక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిజామాబాద్ పేరు మార్చి ఇందూర్‌గా చేయాలని తీర్మానం చేసి, ఏబీవీపీ నుంచి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి పంపిస్తామని తెలిపారు. ముస్లింలంటే..

2

## ఐక్యరాజ్య సమితిలో మరోసారి కశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన పాకిస్థాన్.. తీవ్రంగా స్పందించిన భారత్..

- పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికలను దుర్వినియోగం చేస్తోందన్న భారత్
- జమ్ము కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ సూచనలు అవసరం లేదన్న భారత్
- అంతర్జాతీయ వేదికలపై అబద్ధాలు చెప్పడం సరికాదని హితవు

(తోలి వెలుగు), డెస్క్, జనవరి 16 : ఐక్యరాజ్య సమితిలో పాకిస్థాన్ కశ్మీర్ అంశాన్ని మరోమారు ప్రస్తావించగా, భారత్ దీటుగా స్పందించింది. జమ్ము కశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగమని, అది ఎప్పటికీ కొనసాగుతుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్ కశ్మీర్ గురించి పదే పదే మాట్లాడకుండా ఉంటే మంచిదని వ్యాఖ్యానించింది. ఐక్యరాజ్య సమితి సమావేశంలో పాకిస్థాన్ శాశ్వత రాయబారి అసిమ్ ఇఫ్తికర్ అహ్మద్ జమ్ము కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. భారత శాశ్వత



మిషన్ కౌన్సిలర్ ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ పాకిస్థాన్ ఆరోపణలను ఖండించారు. పదేపదే కశ్మీర్ అంశాన్ని లేవనెత్తుతూ, అబద్ధాలు చెబుతూ పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికలను ..

మిగతా 2 లో..

Toli Velugu 17.01.26_Layout 1 1/17/2026 9:47 AM Page 2



## ఐక్యరాజ్య సమితిలో మరోసారి కశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన పాకిస్థాన్.. తీవ్రంగా స్పందించిన భారత్..

మొదటి పేజీ తరువాయి..

దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మూ కశ్మీర్ ప్రజలు భారత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వారి ప్రాథమిక హక్కులను వినియోగించుకుంటున్నారని తెలిపారు. కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ సూచనలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని పున్నూస్ అన్నారు. అంతర్జాతీయ వేదికలపై అసత్యాలు ప్రచారం చేయడం ద్వారా ఎటువంటి ఫలితం ఉండదని హితవు పలికారు. భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాలలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించడానికి ఐక్యరాజ్య సమితి చార్టర్‌లోని సూత్రాలను ఉపయోగించడం సముచితం కాదని అన్నారు. ప్రపంచ దేశాలలో జరుగుతున్న



హింసపై ఐక్యరాజ్య సమితి స్పందించాలని, వివిధ దేశాల మధ్య నెలకొన్న ఘర్షణలకు ముగింపు పలకాలని ఆయన సూచించారు.

## అందుకే మోదీని కలుస్తున్నా

### - రేవంత్ రెడ్డి

(తొలివెలుగు), డెస్క్, జనవరి 05 :

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇప్పటివరకు విశ్వవిద్యాలయం లేకపోవడం దురదృష్టకరమని పేర్కొంటూ, ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలోనే విశ్వవిద్యాలయానికి అధికారిక ఆమోదం వస్తుందని, బాసరలో వర్సిటీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు అవసరమైన అన్ని నిధులను బడ్జెట్‌లో పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. తుమ్మడి హెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నామని, అక్కడే ప్రాజెక్టును నిర్మించి తీరుతామని సీఎం స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం తీసుకొచ్చే పూర్తి బాధ్యత తనదేనని ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు శిలాఫలకం వేయిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ మంజూరు చేసినట్లే ఆదిలాబాద్‌కూ ఇస్తామని కేంద్రం చెప్పిందని సీఎం గుర్తు చేశారు. అడిగితేనే



అభివృద్ధి వస్తుందని, గత పాలకులు అడగకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. వారి పాలన వల్ల అప్పులు మిగిలాయని, నాడు ఇచ్చిన బియ్యం ఎవరు తిన్నారో తెలియదని, కానీ ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం ప్రజలు తింటున్నారని అన్నారు. సున్నా వడ్డీ పేరుతో గుండు సున్నా మిగిల్చారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు అండగా నిలిస్తే దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతానని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసే వారినే గెలిపించాలని కోరారు.

## భారత్ కు మరిన్ని రఫేల్ యుద్ధ విమానాలు

### - డీపీబీ గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి..

ఆమోదముద్ర వేయనుంది. అంతా సవ్యంగా జరిగితే వచ్చే నెలలోనే భారత్, ఫ్రాన్స్ మధ్య ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉంది. ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా ప్రభుత్వాల మధ్య ఈ కొనుగోలు ప్రక్రియ జరగనుంది. ఇదిలా ఉండగా, భారత నౌకాదళం కోసం రూ.63,000 కోట్ల విలువైన 26 రఫేల్-మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు గతేడాది ఏప్రిల్‌లో భారత్, ఫ్రాన్స్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా 22 సింగిల్-సీటర్ యుద్ధ విమానాలు, నాలుగు ట్విన్-సీటర్ శిక్షణ విమానాలు 2031 నాటికి అందనున్నాయి. మరోవైపు, దేశీయంగా విమానయాన తయారీ



రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో డసో ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ మధ్య ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం, హైదరాబాద్‌లోని టాటా ప్లాంట్‌లో రఫేల్ విమానాల ఫ్యూసిలేజ్‌లను తయారు చేయనున్నారు. 2028 ఆర్థిక సంవత్సరం నుంచి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభం కానుంది.

## ఇదే చివరి అవకాశం..

### ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో స్పీకర్ కు సుప్రీంకోర్టు షాక్!

మొదటి పేజీ తరువాయి..

**గత ఏడాది నవంబర్ లోనే సుప్రీం కీలక ఆదేశం**

తాజాగా జనవరి 15వ తేదీన పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య ఫిరాయింపులపైన ఇచ్చిన అనర్హత పిటిషన్లను స్పీకర్ తిరస్కరించారు. వారిపైన పార్టీ మారినట్టు ఎటువంటి ఆధారాలు లేవని ఆ ఇద్దరు ఇంకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ కేసును గత ఏడాది నవంబర్ నెలలో విచారణ మొదలు పెట్టిన సుప్రీం ధర్మాసనం స్పీకర్ దీనిపైన నిర్ణయం తీసుకోవడానికి నాలుగు వారాల గడువును ఇచ్చింది.

**స్పీకర్ పై సుప్రీం ఆగ్రహం**

అర్హత పిటిషన్ల పైన ఈలోపే నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ ను ఆదేశించింది సుప్రీం ధర్మాసనం. ఇక నవంబర్ వాయిదా తర్వాత మళ్లీ ఇప్పుడు విచారణ జరిపిన క్రమంలో సుప్రీంకోర్టు సీరియస్ గా స్పందించింది. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం, మరో ముగ్గురు ఎమ్మెల్యేల పైన ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం పైన ఆగ్రహం వ్యక్తం చేసింది సుప్రీం ధర్మాసనం.

**చివరి అవకాశం అంటూ స్పీకర్ కు అల్టిమేటం**

స్పీకర్ కు చివరి అవకాశం ఇస్తున్నామని, ఈ సమయంలో కూడా సరైన నిర్ణయం తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందంటూ హెచ్చరికను జారీ చేసింది. మరి ఈ వ్యవహారంలో సుప్రీం కోర్టు ఆగ్రహంగా ఉన్న నేపథ్యంలో స్పీకర్ నిర్ణయం ఏ విధంగా ఉంటుంది అన్నది తెలియాల్సి ఉంది.

## కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతకొద్దు

మొదటి పేజీ తరువాయి..

30 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా టీఎస్ ఐపాస్‌ను రూపొందించామని కేటీఆర్ గుర్తుచేశారు. అవినీతికి ఏమాత్రం తావులేని అత్యంత పారదర్శకమైన ఈ విధానాన్ని పదేళ్లపాటు చిత్తశుద్ధితో అమలు చేయడం వల్లే అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. ఈ విధానం ద్వారా భారీ పరిశ్రమలతో పాటు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (మీవీజు) విభాగంలో రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. తద్వారా రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా గౌరవప్రదమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని వ్యాఖ్యానించారు.

గతంలో తమ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, టీ-హబ్ వంటి వినూత్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లే, ఇప్పుడు టీఎస్ ఐపాస్‌కు కూడా లభించిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ దిగ్గజ సంస్థల నుంచి చిన్న పరిశ్రమల వరకు తెలంగాణ వైపు చూసేలా పెట్టుబడిదారుల్లో ఈ విధానం కొండంత విశ్వాసాన్ని నింపిందన్నారు. “ఇకనైనా కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతికే అరాచక శక్తులు బుద్ధి తెచ్చుకుంటే మంచిది” అని పరోక్షంగా ప్రస్తుత ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. తెలంగాణ మోడల్ ఆచరణీయమని నీతి ఆయోగ్ చెప్పిన తర్వాత కూడా విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

## నిజాం ఒక హంతకుడు

### - ధర్మపురి అర్వింద్

మొదటి పేజీ తరువాయి..

కాంగ్రెస్ అన్నట్టు మాట్లాడటం సరికాదని విమర్శించారు. పహల్గాం ఘటనను ప్రస్తావిస్తూ... అక్కడ హిందువులా, ముస్లింలా అని చూసి కాల్చి చంపారని గుర్తు చేశారు. కొంతమంది హిందువుల్లో కూడా చెడు ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ మొత్తం త్వరలో కాషాయ-ుమయం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎక్కడుందో తెలుసుకోవాలంటే కవితను అడిగితే చెబుతుందని ఎద్దేవా చేశారు. రేపు సిరిసిల్లలో కూడా బీజేపీ బలాన్ని చూపిస్తామని చెప్పారు. ఇందూర్‌కి దమ్ముంటే రా అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే మత ఘర్షణలు జరిగాయని అర్వింద్ ఆరోపించారు. చెన్నారెడ్డి సీఎం పదవికి రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో అల్లర్లు జరిగాయని తెలిపారు. అప్పట్లో ఏసీపీ సత్తయ్య హత్య కేసులో నిందితులను బయటకు తీసుకొచ్చింది మజ్లిస్ పార్టీయేనని ఆరోపించారు. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్నారని, దీనికి కారణం సీఎం రేవంత్ రెడ్డేనని విమర్శించారు. నిజాంను గాడిద అని అన్నందుకే రాద్ధాంతం చేస్తున్నారని, కానీ చరిత్రలో నిజాం ఎప్పటికీ దుర్మార్గమైన రాజుగానే మిగిలిపోతాడని అన్నారు. ఆయన పేరు వినగానే హిందువులకు గుర్తొచ్చేది ఆయన చేసిన మారణకాండేనని పేర్కొన్నారు. ముస్లింలకు ఇళ్లు, రేషన్, ఉచిత వ్యాక్సినేషన్ మోదీ ప్రభుత్వం ఇస్తోందని... ముస్లిం దేశాలకు కూడా వ్యాక్సిన్లు పంపించిందని తెలిపారు.

Toli Velugu 17.01.26_Layout 1 1/17/2026 9:47 AM Page 3



# గ్రామ సేవకులకు 'సంక్రాంతి' కానుక



- పారిశుద్ధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివి
- సర్పంచ్ జువ్వి నర్సింహ్మ

: గ్రామ పరిశుభ్రతలో పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం గ్రామంలోని పంచాయతీ సిబ్బందికి పండుగ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి పండుగ బోనస్‌గా నగదుతో పాటు స్వీట్ బాక్సులు, మాస్కులను అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామం సుందరంగా కనిపించడంలో సిబ్బంది కష్టం ఉందన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంక్రాంతి జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కొంత బుచ్చిరెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది సాయి, జంగయ్య, యాదయ్య, శ్రీనివాస్ చారి, రవి, అండమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు

# ఆసుపత్రిలో కలెక్టర్ 'ఆకస్మిక' తనిఖీ

- రోగులతో ముఖాముఖి: భోజనం, వైద్యంపై ఆరా
- సాధారణ ప్రసవాలు పెరగాలి
- రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి: జిల్లా కలెక్టర్ హనుమంతరావు







ఆలేరు, జనవరి 16 (తొలివెలుగు) : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. శుక్రవారం ఆలేరు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల లభ్యత తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. రోజువారీ ఓపీ విభాగానికి వచ్చే రోగుల సంఖ్య, గర్భిణీ స్త్రీలు చెకప్‌కు ఎంతమంది వస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల జరుగుతున్న ప్రసవాల సంఖ్యను తెలుసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. గర్భిణీలు సమయానికి చెకప్‌కు వచ్చేలా ఆశా కార్యకర్తలు తరచుగా ఫోన్ ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని వారికి తెలియజేయాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. డాక్టర్లు సమయానికి వచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే ఆసుపత్రిలో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా, భోజనం నాణ్యత ఎలా ఉందనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మృత్యువై వచ్చిన లారీ.. వృద్ధురాలి ప్రాణం బలి



వలిగొండ, జనవరి 16 (తొలివెలుగు): వలిగొండ మండలంలోని గొల్నేపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఇంటి ముందు ప్రశాంతంగా కూర్చున్న ఓ వృద్ధురాలిపైకి లారీ దూసుకెళ్లడంతో ఆమె మృతి చెందారు. స్థానికులు, 108 సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్నేపల్లి గ్రామానికి చెందిన ఎర్ర చంద్రమ్మ (70) శుక్రవారం తన ఇంటి ముందు కూర్చుని ఉండగా, అతివేగంగా వచ్చిన లారీ ఆమెపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో చంద్రమ్మ కాళ్లు తీవ్రంగా నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నల్గొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆమె తుదిశ్వాస విడిచారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఐలమ్మ స్ఫూర్తితో.. హక్కుల పోరాటం



వలిగొండ, జనవరి 16 (తొలివెలుగు) : వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రజక సంఘం ప్రతినిధులు నిర్ణయించారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన రజక సంఘం సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా రజక కులస్తుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. రజకులు తమ హక్కుల సాధన కోసం చైతన్యవంతులై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డేమాన్ మహేందర్, రవి, మధుసూదన్, నాగరాజు, శ్రీనివాస్, మధు, లక్ష్మణ్, నరేష్, అశోక్, మహేందర్, మహేష్, రమేష్, గణేష్, సత్తయ్య, లక్ష్మయ్య, ఎల్లయ్య, అనపర్తి భాస్కర్, వడ్లకొండ సత్తయ్య, మల్లేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత చైనా మాంజా విక్రయం : ఒకరి అరెస్ట్

- గాంధీ పార్క్ వద్ద పోలీసుల దాడులు
- మాంజా బాబిన్లు, ప్యాకెట్లు స్వాధీనం





చౌటుప్పల్, జనవరి 16 (తొలివెలుగు) : చౌటుప్పల్ పట్టణంలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆదేశాల మేరకు బ్లూకోల్ట్స్-2 సిబ్బంది గాంధీ పార్క్ సమీపంలో గస్తీ నిర్వహిస్తుండగా, నిషేధిత మాంజా విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టగా, మహమ్మద్ అమీర్ అనే వ్యక్తి వద్ద 'మోనో గోల్డ్' రకానికి చెందిన మూడు చైనా మాంజా బాబిన్లు, 50 చిన్న ప్యాకెట్లు లభించాయి. నిందితుడు చౌటుప్పల్ బంగారిగడ్డ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ అని, ధూల్‌పేటలో గుర్తుతెలియని వ్యక్తి వద్ద వీటిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మాంజాను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

Toli Velugu 17.01.26_Layout 1 1/17/2026 9:47 AM Page 4



# కార్పొరేట్లకు రాయితీలు.. పేదలపై కోతలు!

- ❖ కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై పాలడుగు భాస్కర్ ధ్వజం
- ❖ జిల్లా వ్యాప్త జీపు జాతా ప్రారంభం
- ❖ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్



చౌటుప్పల్, జనవరి 16 (తొలివెలుగు) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలో జిల్లా వ్యాప్త జీపు జాతాను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 11 ఏళ్లుగా కేంద్రం కార్పొరేట్ సంస్థలకు రూ. 16 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చి, సామాన్యుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను, విద్యుత్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 19న భువనగిరిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు గోశిక కరుణాకర్, జీపు జాత నాయకులు చంద్రారెడ్డి, ముత్యాలు, రాగిరి కిష్టయ్య, ఆదిములం నందీశ్వర్, బత్తుల దాసు, బొడ్డు అంజిరెడ్డి, ఆకుల ధర్మయ్య, పరిమి ధర్మారెడ్డి, బండారు నరసింహ, తొర్పునూరి మల్లేశం, కొండే శ్రీశైలం, తడక మోహన్, ఉష్కాగుల శ్రీనివాస్, కలకుంట్ల శివ, చీమకండ్ల శ్రీరాములు, నెలికంటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది : కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



చౌటుప్పల్, జనవరి 16 (తొలివెలుగు) : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై కొత్తపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నకొండూర్ గ్రామ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు దొర్నాల నరేష్ కుమారుడు సాత్విక్ తేజను ఆయన శుక్రవారం పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. అనంతరం నరేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, మల్కాపూర్ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తులో నడిపి.. ప్రాణాల మీదకు తెచ్చి..!

చౌటుప్పల్, జనవరి 16 (తొలివెలుగు): మద్యం మత్తులో లారీ నడిపి ఒక కుటుంబం ప్రయాణిస్తున్న కారును ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌ను పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న తెల్లవారుజామున చౌటుప్పల్ పట్టణంలోని తంగడపల్లి ఎక్స్ రోడ్డు వద్ద విజయవాడ వైపు నుంచి వస్తున్న రెడీమిక్స్ లారీ (టీఎస్ 07 యుజీ 1723) డ్రైవర్ ప్రకాష్ యాదవ్ మద్యం మత్తులో అతివేగంగా వచ్చి స్టాపర్లను, కరెంటు స్తంభాన్ని ఢీకొట్టాడు. అనంతరం కారుపైకి దూసుకెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న భాస్కర్ నాయక్, యాకోబు, ఫాతిమా జోహార్, చిన్నారులు మోసిన్, బిలాల్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడైన డ్రైవర్ ప్రకాష్ యాదవ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ కె. యాదగిరి తెలిపారు.



# ప్రభుత్వ ఖజానాకు గండి.. రిజిస్ట్రేషన్ల మాయాజాలం!

- ❖ తహసీల్దార్ ఫిర్యాదుతో కదిలిన పోలీసులు
- ❖ ఇద్దరు నిందితుల అరెస్ట్.. మరో ఇద్దరు పరారీ




చౌటుప్పల్, జనవరి 16 (తొలివెలుగు): చౌటుప్పల్ మండలంలో భూభారతి రిజిస్ట్రేషన్ లావాదేవీల్లో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మండల తహసీల్దార్ డి. వీరబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. నిందితులు తమకు కేటాయించిన యూజర్ ఐడీలను దుర్వినియోగం చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా తక్కువ స్టాంప్ డ్యూటీ చెల్లించి భూభారతి రిజిస్ట్రేషన్లు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ అక్రమాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో డాక్యుమెంట్ రైటర్ బత్తరాజు తరుణ్ కుమార్, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు పాలమాకుల హరీష్‌లను అరెస్ట్ చేసి న్యాయ రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. అదే సమయంలో ఈ అక్రమాల్లో భాగస్వాములైన తోర్పునూరి లింగస్వామి, పసనూరు బసవరాజులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తూ ఖజానాకు నష్టం కలిగించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ మన్మథ కుమార్ హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ❖ ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రజా సమస్యలపై ప్రత్యక్ష పోరాటం
- ❖ తొమ్మిది నెలలుగా విద్య, వైద్యం, ఉపాధిలో నిరంతర సేవలు
- ❖ చౌటుప్పల్‌లో త్వరలో ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ కార్యాలయం
- ❖ దశాబ్దంగా బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న దామెర గ్రామం
- ❖ పదవి ఉన్నా లేకున్నా ప్రజల మధ్యే ఉంటా
- ❖ ఇఎల్‌వి ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్



చౌటుప్పల్, జనవరి 16 (తొలివెలుగు) : ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారం, ప్రాంతీయ అభివృద్ధి కోసం ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం చౌటుప్పల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత తొమ్మిది నెలలుగా, ఏప్రిల్ 14, 2025 అంబేద్కర్ జయంతి నుంచి విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతర సామాజిక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అయితే సేవా కార్యక్రమాలతోనే అన్ని సమస్యలు పరిష్కారం కావని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి సమస్యల పరిష్కారానికి చౌటుప్పల్‌లో త్వరలో ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇటీవల నాంపల్లి మండలం దామెర గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా, అక్కడ గత పదేళ్లుగా బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా, జిల్లాలో ఇంకా ఫ్లోరోసిస్ సమస్య కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ ఫ్లోరోసిస్ నీటితోనే పంటలు సాగు చేస్తున్న పరిస్థితి ఎంత తీవ్రమైందో తెలియజేస్తుందని అన్నారు. అర్హులైన అనేక మంది వృద్ధులకు ఇప్పటికీ పెన్షన్లు అందడం లేదని, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధన కోసం తాను అండగా ఉంటానని భాస్కర్ హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఉన్న ఏ సమస్యనైనా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే అధికారులతో, ప్రజాప్రతినిధులతో చర్చిస్తానని, ప్రభుత్వం స్పందించని పక్షంలో ప్రజల తరపున పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు సిద్ధమని, తన శక్తిమేరకు సమస్యలు పరిష్కరిస్తానని, అవసరమైతే ప్రభుత్వం నుంచి సాధించుకునే వరకు పోరాడతామని తెలిపారు. మన బతుకులు బాగుంటేనే మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. రాజకీయ పదవి ఉన్నా లేకున్నా ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ ప్రజల కోసమే పనిచేస్తానని భాస్కర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచిన నాయకులు ఐదేళ్ల పాటు స్వప్రయోజనాలకే పరిమితమవుతున్నారని, ఓట్లు వేసిన ప్రజల కోసం పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు.

Toli Velugu 17.01.26_Layout 1 1/17/2026 9:47 AM Page 5



# సంప్రదాయాల పరిరక్షణకు 'సంఘ్' కృషి

- హిందూ మహాసమ్మేళనానికి సిద్ధం కావాలి
- గాంధీ పార్క్‌లో గాలిపటాల పండుగ
- ఎంపీడీవో గోశిక బాలకృష్ణ, జిల్లా కార్యవాహ కృష్ణయ్య





చౌటుప్పల్, జనవరి 16 (తొలివెలుగు) : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కృషి అభినందనీయమని సూర్యాపేట మండల అభివృద్ధి అధికారి గోశిక బాలకృష్ణ అన్నారు. చౌటుప్పల్ నగర సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గాంధీ పార్క్‌లో సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యవక్తగా విచ్చేసిన భువనగిరి జిల్లా కార్యవాహ కంబాలపల్లి కృష్ణయ్య మాట్లాడుతూ.. సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెలలో జన జాగరణ కోసం 'కుటుంబ సంపర్క్' కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మార్చి నెలలో హిందూ మహాసమ్మేళనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పంచ పరివర్తన ద్వారా కుటుంబాలలో దేశభక్తిని, యువతలో సౌశీల్యాన్ని పెంపొందించడమే లక్ష్యమని వివరించారు. అనంతరం స్వయంసేవకులు ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేసి పండుగ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో చౌటుప్పల జాగరణ ప్రముఖ్ బడుగు శ్రీరాములు, చౌటుప్పల కార్యవాహులు పోలోజు శ్రీనివాసాచారి, మలిగ ఉదయ్, గంజి వెంకటేశ్వర్లు, బడుగు బిక్షపతి, ఎం. కరుణాకర్ రెడ్డి, వేణు కుమార్, గోశిక నరసింహ, బడుగు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# అల్లాపురంలో ఏఎన్‌పీ ప్రీమియర్ లీగ్ ఘన ముగింపు

- క్రికెట్ మైదానంలో సంక్రాంతి పండుగ సంబరం
- ఏఎన్‌పీ లీగ్ కైవసం చేసుకున్న శ్రీకాంత్ టీం
- అల్లాపురంలో ముగిసిన ముక్కోణపు టోర్నీ
- విజేతలకు నగదు బహుమతుల అందజేత







చౌటుప్పల్, జనవరి 16 (తొలివెలుగు) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అల్లాపురం గ్రామంలో నిర్వహించిన అల్లాపురం, దేవలమ్మ నాగారం, పీపల్ పహాడ్ గ్రామాల (ఏఎన్‌పీ) ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా ముగిసింది. మూడు గ్రామాల యువతను ఒక్కటిగా చేర్చిన ఈ ముక్కోణపు టోర్నీ క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. పోటీల్లో పలు జట్లు తలపడగా, ఫైనల్ మ్యాచ్‌లో యంజాల శ్రీకాంత్ నాయకత్వంలోని జట్టు అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థులను మట్టికరిపించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ముత్యాల నర్సిరెడ్డి రూ.10,000 నగదు బహుమతిని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన నల్లెంకి సాయి బృందానికి సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి రూ.5,000 ప్రైజ్ మనీని అందజేశారు. ఈ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించేందుకు అల్లాపురం గ్రామ సర్పంచ్ టేకుల మంజుల రెడ్డి ప్రత్యేక సహకారం అందించారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వరకాంతం మహిపాల్ రెడ్డి, సింగిరెడ్డి మహిపాల్ రెడ్డి, ముత్యాల సుదర్శన్ రెడ్డి, సుర్కంటి బుచ్చిరెడ్డి, టేకుల వెంకటరెడ్డి, రాసాల రజనీకాంత్, ముత్యాల రాఘవేందర్ రెడ్డి, ఆర్గనైజర్స్ జె. యాదగిరి, అర్థ అశోక్ రెడ్డి, అర్థ అనిల్ రెడ్డి, యంజాల శ్రీకాంత్, యాస పవన్ రెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల భద్రతపై అవగాహన కల్పించిన పోలీసులు




పటాన్చెరు జనవరి 16 (తొలివెలుగు): రోడ్డు ప్రమాదాల భద్రతపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు గుమ్మడిదల ఎంపిడిఓ కార్యాలయంలో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు ముఖ్య అతిథిగా డి.ఎస్.పి ప్రభాకర్ హాజరయ్యారు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు, ఎలిమెంట్ , సీట్ బెల్టు, తప్పనిసరిగా వాడాలని, తగిన అంత వేగంతో బండ్లు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని, పలు సూచనలు సూచించారు జిన్నారం ఇన్స్పెక్టర్ రమణారెడ్డిహగుమ్మడిదల తహసిల్దార్ పరమేశం ఎంపీడీవో ఉమాదేవి ప్రాథమిక ఆరోగ్య వైద్యురాలు ఎస్ హెచ్ ఓ లక్ష్మి కాంత్ రెడ్డి, మండల స్థాయిలో పనిచేసే ఆయా సంస్థల ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

# భూభారతి నిధులతో ప్రభుత్వ ఖజానాకు మోసం

- సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్న ఐదుగురు అరెస్ట్
- కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింపు




వలిగొండ, జనవరి 16 (తొలివెలుగు) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి పోర్టల్ యాప్‌ను దుర్వినియోగం చేసి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్‌లు తెలిపారు. భూభారతి పోర్టల్ ద్వారా రైతుల భూముల కొనుగోలు, అమ్మకాల లావాదేవీల్లో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములను అక్రమంగా తమ ఖాతాల్లోకి మళ్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కలకూరి మధు, భువనేష్, రాజు, రాకేష్, శివరామకృష్ణలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తహసిల్దార్ దశరథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మరింత లోతైన విచారణ చేపట్టి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్ స్పష్టం చేశారు.

# స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి




(తొలివెలుగు), బోయిన్పల్లి, జనవరి 16 : రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ సేవలు మండల కేంద్రంలో కూడా ఏర్పాటు చేసి బ్యాంకు ఖాతా వినియోగదారులకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేయాలని బోయిన్పల్లి మండల సిపిఎం పార్టీ తరఫున ప్రజల పక్షాన ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతుంది. ఎందుకంటే బోయిన్పల్లి మండలంలో మెజార్టీ గ్రామాలన్నీ మండల కేంద్రానికి అనుసంధానంగా ఉన్నప్పటికీ విలాసాగర్ గ్రామంలో ఉండడంవల్ల బ్యాంకు ఖాతాదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం బ్యాంకు శాఖ అధికారులు పునరాలోచించి బోయిన్ పల్లి మండల కేంద్రంలో కూడా బ్రాంచ్ ఏర్పాటుచేసి ఇక్కడున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలగకుండా సేవలు అందించే విధంగా ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని మండల కేంద్రంలో కూడా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఏర్పాటుచేసి వినియోగదారులకు సేవలు అందే విధంగా ఏర్పాటు,చేయాలని మండల ప్రజల పక్షాన పత్రిక ముఖంగా మండల సిపిఎం పార్టీ డిమాండ్ చేయడం జరుగుతుంది.